క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక



కోనాపూర్‌లో నూతన కమిటీ సభ్యులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోనాపూర్‌లో కల్లుగీతా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం గ్రామంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో నూతన అధ్యక్షుడిగా కె.నాగరాజుగౌడ్, ఉపాధ్యక్షుడిగా వెంకటయ్య, కార్యదర్శి జయశంకర్‌గౌడ్‌లను ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా అంజిలమ్మ, విజయలక్ష్మి, కొత్త రాజుగౌడ్, బాల ముకుంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను స్కూల్లో చేర్పించాలి



విద్యార్థిని బడిలో చేర్పిస్తున్న సీఆర్పీ రాజు

కుల్కచర్ల: బడీడు పిల్లలను స్కూల్లో చేర్పించాలి తల్లిదండ్రులతో ముజాహిద్‌పూర్ క్లస్టర్ సీఆర్పీ రాజు పేర్కొన్నారు. శనివారం బోట్యానాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో వి.రోహిత్ అనే విద్యార్థిని గుర్తించి అతనిని బడిలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చదువుకుంటేనే సమాజంలో మంచిచెడులను తెలుసుకోవచ్చన్నారు. భావిభారత పౌరులుగా ఎదగొచ్చన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయవర్దన్, ఉపాధ్యాయులు సంతోష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా యూత్‌ఫర్ సేవ

- విద్యాధికారి విజయ రామారావు
- 15మందికి సైకిళ్ల పంపిణీ



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న యూత్ ఫర్ సేవ సంస్థ సభ్యులు

దుద్యాల్: యూత్ ఫర్ సేవ సంస్థ విద్యార్థులకు అండగా నిలుస్తుందని మండల విద్యాధికారి విజయ రామారావు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు యూత్ ఫర్ సేవసంస్థ సహకారంతో 15 మందికి సైకిళ్లు, పదోతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, పాఠశాలకు రసాయన, భౌతికశాస్త్ర ల్యాబ్ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పేద విద్యార్థులకు ఈ సంస్థ ద్వారా సహకరిస్తామన్నారు. తెలంగాణ విద్యా వంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్, కోశాధికారి గొరారం గోపాల్‌లు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా అందరం గ్రూపుగా ఏర్పడి విద్యార్థులకు, పేదలకు అనేక ప్రోత్సాహక, సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు భరద్వాజ్, హరీశ్, భార్గవి, వీణ, స్వరూప్, వెంకటేశ్, సతీశ్, విశాల్, పుండరీకాక్ష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్త చెరువు పరిశీలన

పరిగి: పట్టణ కేంద్రంలోని కొత్త చెరువును నీటి పారుదల శాఖ ఎస్ఈ రంగారెడ్డి శనివారం పరిశీలించారు. పట్టణ కేంద్రంలోని కొత్త చెరువు అన్యాక్రాంతం అయిందని స్థానిక నాయకులు ఫిర్యాదు మేరకు ఆయన పరిశీలించారన్నారు. చెరువు కట్టపై ముళ్లపొదలు చెట్లు ఉండటంతో తరువాత చెరువు విస్తీర్ణాన్ని సర్వే చేయిస్తామన్నారు.

ఎన్నికల్లో సత్తా చాటుతాం

విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకుల వెల్లడి



మాట్లాడుతున్న నాయకులు

తాండూరు రూరల్: వచ్చే సర్పంచు, ఎంపీటీసీ ఎన్నికల్లో గెలిచి సత్తా చాటుతామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సిరిగిరిపేట్ వీరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి నివాసంలో మండల నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మడం లేదన్నారు. సర్పంచు ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్య పెడుతుందని పేర్కొన్నారు. అనార్హులకు ప్రభుత్వ పథకాలు మంజూరు చేశారన్నారు. ఇక నుంచి ప్రజాల్లో ఉండి..ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తామన్నారు. పంజుగుల శ్రీశైల్‌రెడ్డి, రాజప్పగౌడ్, గాడి వెంకటేశం, మొగులప్ప, మాధవరెడ్డి, ఆర్‌సీ గౌడ్, శంషోద్దీన్, యాద ప్పగౌడ్, హేమంత్‌కుమార్, హసేన్ పటేల్, రాకేష్‌గౌడ్, ప్రదీప్‌రెడ్డి, జీవరత్నం పాల్గొన్నారు.

కూలీలు దొరకట్లే!



నాట్లు వేస్తున్న కూలీలు

ముదిరిపోతున్న నారు

- ఎకరానికి రూ.8వేలు ఖర్చు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు

దౌల్తాబాద్: యాసంగికి వరినాట్లు వేసేందుకు కూలీలు దొరక్క మండలంలోని రైతులు నానా అవస్థలు పడుతున్నారు. పోసిన నారు ముదిరిపోతున్నా పనిచేసే వారు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో సంవృద్ధిగా వానలు పడడంతో చెరువులు కుంటలు నిండి భూగర్భజలాలు పుష్కలంగా పెరిగాయి. దీంతో యాసంగిలో పంటలు బాగా పండించాలన్నా గంపెడాశతో రైతాంగం పెద్ద మొత్తంలో వరిసాగుకు ఏర్పాట్లు చేసుకున్నారు. తీరా నాట్లు వేసే సమయానికి సరిపడా కూలీలు దొరకకపోవడంతో రైతన్నలు అయోమయంలో ఉన్నారు.

6వేల ఎకరాల్లో..

మండలంలో యాసంగికి 6వేల ఎకరాల్లో వరిసాగవుతుందని అంచనా. ప్రస్తుతం 400 ఎకరాల్లో నాట్లు వేసినట్లు తెలిపారు. కూలీల కొరతతో వరి నార్లు ముదిరిపోతున్నాయి. 20 రోజుల నుంచి 40 రోజుల్లోపు నాటు వేసుకోవాలి. కానీ రెండు నెలలు దాటుతున్నా నాట్లు వేయని పరిస్థితి నెలకొంది. ముదిరిన నారు వేస్తే దిగుబడిపై ప్రభావం పడే ప్రమాదం ఉంది. రైతులు పోటీపడి కూలీలకు ఎక్కువ ఇస్తామంటూ ఆశ చూపిస్తున్నారు. దీంతో రేటు రోజురోజుకు మరింత పెరుగుతుంది. మండలంలో రైతులు ప్రతి రోజు నాట్లు వేసే కూలీల కోసం తిరుగుతున్నా ఫలితం కనిపించడంలేదు. గతేడాది వరకు ఎకరం నాటు వేసేందుకు కూలీలకు రూ.6వేలలోపు ఖర్చయ్యేది. ఈ ఏడాది యాసంగి కూలీలకు డిమాండ్ పెరగడంతో ఎకరానికి రూ.6వేల నుంచి 8వేల వరకు ఖర్చుచేయాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో గ్రామాల్లో 10నుంచి 20మంది మహిళలు జట్టుగా ఏర్పడి గుత్తకు ఎకరం రూ.7వేల నుంచి రూ.8వేల వరకు నాట్లు వేస్తున్నారు. అలాగే వారి రవాణాకు ఆటో ఖర్చు కూడా రైతే భరించాల్సి వస్తుంది.

కూలీల కొరత ఉంది



నాటు వేసే యంత్రాలు వస్తే తప్పా భవిష్యత్‌లో వ్యవసాయం చేయడం కష్టం. ఇప్పుడు నాటేసేందుకు కూలీలు దొరకడంలేదు. గిట్లయితే ఎవుసం ఎట్లా. ప్రభుత్వం నాట్లేసే యంత్రాలను సబ్సిడీపై రైతులకు అందించాలి.

– రమేష్, రైతు, దౌల్తాబాద్

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు



దుద్యాల్ పాఠశాలలో త్రివర్ణ జెండాలను క్రమంగా అతికిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

దుద్యాల్: గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పాఠశాలల్లో విద్యార్థులు తమతమ తరగతి గదులను రంగు రంగులుగా అలంకరించడం, పాఠశాల ముందు ముగ్గులు వేసి ముస్తాబు చేశారు. జెండా దిమ్మెలకు, కర్రలకు త్రివర్ణ రంగులు వేసి వేడుకలకు సిద్ధం చేస్తున్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్: గణతంత్ర వేడుకలకు తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, మున్సిపాలిటీ, పోలీస్‌స్టేషన్, తదితర కార్యాలయాలను మామిడి తోరణాలు, రంగు రంగుల కాగితాలను కట్టి అందంగా తీర్చిదిద్దారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో పలు రకాల క్రీడా పోటీలు, వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనం వంటి వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ఆదివారం విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, జాతినేతల వేషాధారణ వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ వేడుకల్లో బహుమతులు అందజేసి ప్రోత్సాహం అందిస్తామని ఎంఈఓ హరిలాల్ పేర్కొన్నారు.



బొంరాస్‌పేట: మేడిచెట్టు తండా పాఠశాలలో తోరణాలతో అలంకరిస్తున్న విద్యార్థులు

విమర్శలు సరికాదు

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాందాస్ నాయక్

కుల్కచర్ల: కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలపైనే కొనసాగుతుందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాందాస్ నాయక్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డిని కాంగ్రెస్ నేతలు విమర్శించడాన్ని ఖండిస్తూ శనివారం చౌడాపూర్‌లో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అవకాశవాద రాజకీయాలు చేస్తూ ప్రజలకు ఏం చెప్పాలో తెలియక ఇష్టారీతిన ప్రతిపక్ష నాయకులను వ్యక్తిగతంగా విమర్శిస్తున్నారన్నారు. రాజకీయంలో పాలనపై దృష్టిపెట్టకుండా విమర్శించడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్, మాజీ కోఆప్షన్ సభ్యులు జుబేర్ మహ్మద్, బీఆర్ఎస్ నాయకులు మఠం రాజశేఖర్, పాల నర్సింలు, కృష్ణయ్య, మానయ్య, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

హనుమాన్ ఆలయంలో పారాయణం

కొడంగల్: పట్టణ శివారులో సిద్ధులు తపస్సు చేసిన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. 70 వారాలుగా సామూహికంగా హనుమాన్ చాలీసాను పటిస్తున్నారు. హిందూవాహిని ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి రాకేశ్‌కుమార్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు గంటి సర్వేష్, ఆవుల ఓం ప్రకాశ్, భాను తదితరులు పూజలో పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి

బొంరాస్‌పేట: పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులు సహకరించాలని హెచ్ఎం విజయలక్ష్మి పేర్కొన్నారు. మండల పరిధిలోని భోజన్న గడ్డ తండా ప్రాథమిక పాఠశాలలో శనివారం పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పాఠశాలలో నిర్వహిస్తున్న పనులు, కార్యక్రమాలు, విద్యాభాసం, నిధులు, విద్యార్థుల ప్రగతి, ప్రతిభ తదితర విషయాలను తెలియజేశారు. పాఠశాల ఉన్నతికి తల్లిదండ్రుల పాత్ర ప్రధానమన్నారు. పాఠశాల పనితీరు పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

హెల్మెట్, సీటుబెల్టు తప్పనిసరి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ



బొంరాస్‌పేట: అవగాహన సమావేశం

యాలాల: హెల్మెట్, సీటుబెల్టు తప్పనిసరిగా ధరించాలని యాలాల ఎస్ఐ గిరి పేర్కొన్నారు. శనివారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండలంలోని లక్ష్మీనారాయణపూర్‌లో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ..వాహనదారులు హెల్మెట్, సీటుబెల్టు ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్త వహించాలన్నారు.

నవాబుపేటలో..

నవాబుపేట: ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని ఎస్ఐ అరుణ్‌కుమార్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో విద్యార్థులు, యువకులతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు నియమనిబంధనలు పాటించాలన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: వాహనదారులు జాగ్రత్తగా తమ వాహనాలను నడుపుకోవాలని ఎస్ఐ ఎండీ రవూఫ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. మైనర్లు వాహనాలను నడపొద్దన్నారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ హరిలాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నవాబుపేట: అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అరుణ్‌కుమార్

సంక్షిప్త వార్తలు

• జుంటుపల్లి ఆలయ హుండీ లెక్కింపు

యాలాల: మండల పరిధిలోని జుంటుపల్లి శ్రీ సీతా రామచంద్రస్వామి ఆలయ హుండీని శనివారం లెక్కించారు. కొన్ని నెలలుగా భక్తులు కానుకలుగా సమర్పించిన నగదును లెక్కించగా, మొత్తం రూ.46,875ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ రాజేందర్‌రెడ్డి తెలిపారు. అనంతపద్మనాభ స్వామి ఆలయ ఈఓ నరేందర్, ఆలయ చైర్మన్ శ్యాంసుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

• బీటీ రోడ్ల నిర్మాణాలకు అనుమతులు ఇప్పించాలి

దౌల్తాబాద్: మండలంలో అల్లాపూర్ నుంచి గుండేపల్లి, దౌల్తాబాద్ నుంచి రావల్‌పల్లి గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మాణాలకుగాను అటవీశాఖ అనుమతులు ఇప్పించాలని మాజీ వైస్‌ఎంపీపీ వెంకట్‌రెడ్డి ఎంపీ డీకె అరుణను ఒక ప్రకటనలో కోరారు.

• సమయపాలన పాటించని వ్యవసాయ అధికారులు

దోమ: రైతు వేదిక కార్యాలయాలకు సమయానికి అధికారులు రావడం లేదని మోత్కూరు క్లస్టర్ రైతులు ఆరోపిస్తున్నారు. శనివారం మోత్కూరు గ్రామంలోని రైతువేదికకు గ్రామానికి చెందిన పలువురు రైతులు ఉదయాన్నే వచ్చారు. అయితే 10:41 నిమిషాలు అవుతున్నా రైతువేదిక తీయలేదని, కనీసం కూర్చొవడానికి సైతం ఇబ్బందులు ఎదుర్కొన్నామని సంబంధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

• టై, బెల్టు ఐడికార్డులు అందజేత



దోమ: గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఉన్నతికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని దోమ మండల ఎంపీడీఓ మహేశ్ బాబు, ఎంఈఓ వెంకట్ పేర్కొన్నారు. శనివారం ఐలబాద్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు తులసీరాం టై, బెల్టులు, ఐడికార్డులను పంపిణీ చేసే కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయులు తాము చేస్తున్న ఉద్యోగాన్ని ఒక పనిగా కాకుండా బాధ్యతగా నిర్వహించాలన్నారు.

• ఆందోళన చెందొద్దు

కొడంగల్ రూరల్: జాబితాలో పేరులేనివారు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని పంచాయత్‌రాజ్ ఏఈ, టేకుల్‌కోడ్ గ్రామ ప్రత్యేకాధికారి రవికిరణ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని టేకుల్‌కోడ్, పెద్ద నందిగామ, పాటిమీదిపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు.

రక్తదానంతో ప్రాణాదానం

కొడంగల్: రక్తదానంతో ప్రాణాదానం చేసినట్లేనని నిర్వాహకులు ఆనంద్‌కుమార్ లాహోటీ, వినోద్‌కుమార్ లాహోటీ పేర్కొన్నారు. యువకులు ఎక్కువగా రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలు కాపాడాలని కోరారు. శనివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఏడాది రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పట్టణంలోని ఓం ట్రేడింగ్ కంపెనీ ఆవరణలో ఆదివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉత్సాహవంతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజాస్వామ్యంలో ఓటు కీలకం



అనంతగిరి: వికారాబాద్ ఎంపీడీఓ కార్యాలయం ముందు ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు తదితరులు



దుద్యాల్: ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ కిషన్



కొడంగల్: సీనియర్ సిటీజన్స్‌కు సన్మానం చేస్తున్న అధికారులు



మోమిన్‌పేట: తహసీల్దారు కార్యాలయం ఎదుట ప్రతిజ్ఞ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది తదితరులు

తాండూరు టౌన్: ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటర్లే కీలకమని యువజాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు పర్యాద రామకృష్ణ అన్నారు. స్థానిక శాలివాహన డిగ్రీ కళాశాలలో ఓటరు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు అనేది ప్రజాస్వామ్య పాలనలో ఒక ఆయుధమన్నారు.

దుద్యాల్: ప్రజా స్వామ్యంలో ఓటు కీలకమని తహసీల్దార్ కిషన్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యలయం వద్ద జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ వీరేశ్ బాబు, ఆర్ఐ నవీన్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్: సమాజంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, ఎంపీడీఓ ఉషశ్రీ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సీనియర్ సిటిజన్స్‌కు సన్మానం చేశారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

మోమిన్‌పేట: ప్రజాస్వామ్యంలో మంచి నాయకున్ని ఎన్నుకోవడానికి ఓటు వజ్రాయుధంలా పని చేస్తుందని తహసీల్దార్ మనోహర్‌చక్రవర్తి పేర్కొన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన ఓటర్ల దినోత్సవం సందర్భంగా రెవెన్యూ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.



కుల్కచర్ల: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, యువకులు, విద్యార్థులు

కుల్కచర్ల: వయోజనులందరూ తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కుల్కచర్ల తహసీల్దార్ మురళీధర్, చౌడాపూర్ తహసీల్దార్ ప్రభులు పేర్కొన్నారు. కుల్కచర్ల, చౌడాపూర్‌లో విద్యార్థులు, యువకుల చేత ప్రతిజ్ఞను చేయించారు.

ధారూరు: ధారూరు మండల కేంద్రంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర శాఖల అధికారులు, తహసీల్దార్ సాజిదాబేగం విధిగా ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.

దోమ: దోమ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో నిర్వహించారు. బొంపల్లి గ్రామపంచాయతీలో పంచాయతీ కార్యదర్శి మీనా యువకుల చేత ప్రతిజ్ఞ చేయించారు.

దౌల్తాబాద్: మండలంలోని నీటూరు గ్రామంలో ఘనంగా ఓటరు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్‌భారతి ఓటు హక్కుపై గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు.



ధారూరులో...

యాలాల: ఓటు హక్కు ఎంతో విలువైనదని యాలాల తహసీల్దార్ అంజయ్య అన్నారు. ఓటరు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చావిడీ సమీపంలో మానవహారంగా ఏర్పడి ఓటు ప్రాధాన్యతపై ప్రతిజ్ఞ చేయించారు.

నవాబుపేట: ప్రజా స్వామ్యంలో ఓటు హక్కు వజ్రయూధం లాంటిదని తహసీల్దార్ జైరాం పేర్కొన్నారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు ప్రతిజ్ఞ చేశారు.

బంట్వారం: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. మోడల్ స్కూల్ ఆవరణలో విద్యార్థులతో కలిసి మానహరం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కోట్‌పల్లిలో తహసీల్దార్ శ్రీనివాస్ మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు.



బంట్వారం: కోట్‌పల్లిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

అనంతగిరి: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆయా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాల్లో ఓటు విలువ, ప్రాధాన్యత, ప్రజాస్వామ్యం విజయవంతంలో ఓటు ఎంత కీలకంగా పనిచేస్తుందనే అంశాలపై వివరించారు.

బొంరాస్‌పేట: ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు ప్రదానమైనదని ఎంఈఓ హరిలాల్ పేర్కొన్నారు. బొంరాస్‌పేట, వడిచర్ల, తదితర గ్రామాల్లోని పాఠశాల విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ వెంకన్నగౌడ్, హెచ్ఎంలు రవీందర్‌గౌడ్, నరేందర్, గోపాల్, ఉపాధ్యాయులు బాకారం చంద్రశేఖర్, మల్లయ్య, అనిల్‌కుమార్ తదితరులున్నారు.

మరమ్మతులు చేయడం అభినందనీయం

కుల్కచర్ల: దినసరి కూలీ పనులు చేసుకుంటూ జీవనాన్ని గడిపే హమాలీలు వివేకానంద స్టేజీకి మరమ్మతులు చేయడం అభినందనీయమని పీఎస్‌పీఎస్ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం ఛత్రపతి మహారాజ్ హమాలీ సంఘం ఆధ్వర్యంలో వివేకానంద విగ్రహ స్టేజీకి మరమ్మతు పనులు నిర్వహించి వాటికి రంగులు అద్దారు. ఆదివారం నిర్వహించనున్న జాతీయ జెండా ఆవిష్కరణకు దిమ్మెను నిర్మించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతిఒక్కరూ జాతీయభావాన్ని పెంపొందించుకుని సమాజ అభ్యున్నతిలో తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు మాలె కృష్ణయ్య, పీఎస్‌పీఎస్ మండల అధ్యక్షుడు హరికృష్ణ, బాలక్రిష్ణ, శ్రీనివాస్, రవి, చత్రపతి హమాలీ సంఘం అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

శ్రీవారికి అభిషేకం



స్వామివారి సేవలో భక్తులు

కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం పలు రకాల పూలతో అందంగా అలంకరించారు. స్వామి వారికి అర్చకులు అభిషేకం నిర్వహించారు. స్వామివారు నిజ రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శ్రీవారి మూలమూర్తికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా నిత్య పూజలు, కైంకర్యాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.